క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి..

సుజాతనగర్: రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలకు నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ బి.రోహిత్‌రాజు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మాట్లాడుతూ.. సమస్యలతో స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చేలా బాధ్యతగా మెలగాలన్నారు. నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నేడు స్పాట్ కౌన్సెలింగ్

పాల్వంచరూరల్: స్థానిక సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు గురువారం విద్యార్థినులకు ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మైథిలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు కుల, ఆదాయ, పుట్టిన ధృవీకరణ పత్రాలతోపాటు టెన్త్ ఉత్తీర్ణత మెమో, ఆధార్ ఒరిజనల్ సర్టిఫికెట్లు, పాస్ ఫొటోలు తీసుకోవాలని కోరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

జూలూరుపాడు: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్తూ పడమటనర్సాపురంలో ఆగారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు భూక్యా రమేష్, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. వినోద్‌రావు మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. ధరావత్ బాలకిషన్, రాంబాబు, భూక్యా చరణ్, గుగులోత్ బాబులాల్ పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

టేకులపల్లి: ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు టేకులపల్లి మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన రూ.9.73 కోట్లతో జరిగిన 667 పనులపై ఈ నెల 24 నుంచి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో బుధవారంతో సామాజిక తనిఖీలు ముగిశాయని ఎంపీడీఓ మల్లీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక తనిఖీలకు పరిశీలకులుగా ఏపీఓ అన్నపూర్ణ, ఐటీ ఏఈ స్వాతి, సీడీపీఓ కేఎం తార, ఎంఈఓ జగన్ నాయక్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పశువైద్యాధికారి వి.అనిల్ వ్యవహరించారని పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక సమావేశం ఉంటుందని అందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

సిబ్బంది నియామకం

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: వైల్డ్‌లైఫ్ పాల్వంచ డివిజన్ వన్యప్రాణుల సంరక్షణ విభాగంలో వన్యప్రాణుల సంరక్షణతో పాటు, కలప స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో సిబ్బంది లేక అలంకార ప్రాయంగా మారింది. 'అలంకార ప్రాయంగా అటవీ చెక్‌పోస్టులు'అనే శీర్షికతో ఈనెల 22న సాక్షిలో ప్రచురితమైన వార్తా కథనానికి అటవీశాఖ డీఎఫ్ఓ స్పందించారు. ఈ మేరకు మొండికట్ట చెక్‌పోస్టుకు ఇల్లెందు రేంజ్‌లో విధులు నిర్వహిస్తున్న చంద్రయ్య, కిన్నెరసాని చెక్‌పోస్టుకు నగేష్, యానంబైల్ బీట్ ఆఫీసర్‌గా కృష్ణచైతన్యలను నియమించగా బాధ్యతలు స్వీకరించి విధుల్లో పాల్గొన్నట్లు వైల్డ్‌లైఫ్ ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓ కృష్ణమాచారి బుధవారం తెలిపారు.

డంపింగ్ యార్డ్‌ను మార్చాలి

సింగరేణి(కొత్తగూడెం): పాత కొత్తగూడెంలో ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్న డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేయాలని సీపీఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. స్థానిక పాత కొత్తగూడెంలో డంపింగ్ యార్డ్‌ను బుధవారం సీపీఎం బృందం సందర్శించింది. బాలరాజు మాట్లాడుతూ... ఇక్కడే శ్మశానవాటిక, బతుకమ్మ ఘాట్, సమ్మక్క సారాలమ్మ గద్దెలు ఉన్నాయని, వెళ్లడానికి దారి లేకుండా పూర్తిగా చెత్తమయం చేశారని ఆరోపించారు. స్థానికులు యార్డ్‌ను మార్చాలని పదేపదే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా, కరెంట్ కట్ చేస్తామని బెదిరిస్తున్నారని విమర్శించారు. ఇక్కడ డంపింగ్ యార్డ్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'కూలీబంధు' ఇవ్వాలి

సుజాతనగర్: కేరళ తరహాలో వ్యవసాయ కూలీలకు రూ.లక్ష రూపాయల కూలీబంధు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం సమస్యల అధ్యయన యాత్రలో భాగంగా బుధవారం రాఘవాపురం గ్రామంలో నాట్లు వేస్తున్న కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యదర్శి వీర్ల రమేష్ మాట్లాడుతూ.. రోజంతా కష్టపడి పని చేస్తున్న కూలీలకు వచ్చే వేతనం గిట్టుబాటు కావడం లేదన్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలతో కూలీల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. కాట్రాల తిరుపతిరావు, గండమాల భాస్కర్, వెంకన్న, మురిపిటి వెంకన్న పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అప్‌గ్రేడ్ కలేనా?

- నిరుపేదలకు అందని మెరుగైన వైద్యం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


జూలూరుపాడులోని 30 పడకల ఆస్పత్రి

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) అప్‌గ్రేడ్ కలగానే మిగిలేలా ఉంది. పీహెచ్‌సీ ప్రాంగణంలో ప్రభుత్వం 23 ఏళ్ల క్రితం నిర్మించిన 30 పడకల ఆస్పత్రి భవనంలో 2012 నుంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) అనధికారికంగా కొనసాగుతోంది. అయినా వైద్యవిధాన పరిషత్‌లో విలీనం కాకపోవడంతో అప్‌గ్రేడ్‌కు నోచుకోలేదు. ప్రస్తుతం 12 గంటల పీహెచ్‌సీగానే కొనసాగుతోంది. జిల్లాలోని చర్ల, జూలూరుపాడు పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా మార్చాలనే ప్రతిపాదనలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2022లో వైద్యవిధాన పరిషత్ జిల్లా ప్రధాన ఆస్పత్రుల పర్యవేక్షణ అధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ రవిబాబు 30 పడకల ఆస్పత్రి భవనాన్ని సందర్శించి, సౌకర్యాలను పరిశీలించారు. వైద్య విధాన పరిషత్‌లోకి మార్చేందుకు ప్రభుత్వానికి నివేదిక అందజేసి, మూడేళ్లైనా పురోగతి లేదు. రూ.లక్షలతో భవనాన్ని నిర్మించారు గానీ పీహెచ్‌సీగానే కొనసాగుతోంది. ప్రజలకు సరైన వైద్యసేవలు అందకపోవడంతో ఖమ్మం, కొత్తగూడెం తదితర పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత, గత ఎమ్మెల్యేలు అప్‌గ్రేడ్‌కు కృషి చేస్తామని ఇచ్చిన హామీలు నీటి మూటలే అయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు 2002లో రూ.62 లక్షల నిధులతో నిర్మించే 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు ఆ నాటి రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 2007లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సంభాని చంద్రశేఖర్ ప్రారంభోత్సవం చేశారు. 30 పడకల ఆస్పత్రి కోసం నిర్మించిన ఖాళీ భవనంలోకి పీహెచ్‌సీని మార్చి వైద్యసేవలు అందిస్తున్నారు. అనాటి నుంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా పేర్కొంటున్నారు.

అప్‌గ్రేడ్ అయితే...

సీహెచ్‌సీగా ఏర్పాటు చేస్తే అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం డెంటల్ డాక్టర్ ఖాళీగా ఉండగా, డ్యూటీ మెడికల్ ఆఫీసర్, జనరల్ సర్జన్, గైనకాలజిస్ట్, సర్జరీ, పిల్లల వైద్య నిపుణులు, ఆర్థోపెడిక్, అనస్తీషియా, రేడియాగ్రాఫర్, ఫార్మసిస్ట్, డార్క్ రూమ్ అసిస్టెంట్, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, వాచ్‌మెన్‌లను నియమించాల్సి ఉంటుంది.

ప్రభుత్వం స్పందించాలి...



పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలి. రెండు దశాబ్దాల క్రితం 30 పడకల ఆస్పత్రి కోసం భవనాన్ని నిర్మించారు గానీ అప్‌గ్రేడ్‌కు నోచుకోలేదు. సీపీఐ ఆధ్వర్యంలో ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆందోళనలు చేసి, వినతిపత్రాలు అందజేశాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– గుండెపిన్ని వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి

అధికారులు దృష్టి సారించాలి..



ఆస్పత్రి అప్‌గ్రేడ్ కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా విస్తరించడంతోపాటు వైద్యులు, వైద్యసిబ్బందిని నియమించి, యంత్ర పరికరాలను సమకూర్చాలి. 30 పడకల ఆస్పత్రి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టాం. ప్రస్తుతం సీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలు అందించాలి.

– యాసా నరేష్, సీపీఎం మండల కార్యదర్శి

ప్రతిపాదనలు పంపించాం..



సీహెచ్‌సీ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. వైద్య విధాన పరిషత్‌లో విలీనం అయితే అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ భవనంలో కొనసాగుతున్న పీహెచ్‌సీని పడమటనర్సాపురం లేదంటే మరోచోటుకు తరలించేందుకు విధంగా ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం మెరుగైన సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ, జూలూరుపాడు

వేతనాలు పెంచాలని వినతి


సింగరేణి డైరెక్టర్(పా)కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న 32 వేల మంది కార్మికుల వేతనాలు పెంచాలని బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్(పా) గౌతంపొట్రుకు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాసుద్దీన్ మాట్లాడుతూ... కార్మికులు అతి తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, ఈ విషయమై ఏళ్ల తరబడి యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా అధికారులు స్పందించటం లేదన్నారు. తక్షణమే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ వివరాలు ఆన్‌లైన్ చేస్తానని హామీ ఇచ్చి చేయటం లేదని దీంతో కార్మికులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. దీంతోపాటు కొన్ని ప్రాంతాలలో కాంట్రాక్ట్ కార్మికులకు 7వ తేదీ లోపు వేతనాలు చెల్లిస్తున్నారు కానీ, మరికొంత మంది కాంట్రాక్టర్లు 15వ తేదీ వచ్చినా వేతనాల చెల్లింపులో జాప్యం చేస్తున్నారన్నారు. సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ సమస్యలను పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.బ్రహ్మానందం, గౌని నాగేశ్వరరావు, ఎస్.సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి రోడ్డు పరిశీలన


రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ, డీఈ

పాల్వంచరూరల్: తోగ్గూడెం గ్రామంలో మండల పరిషత్ ద్వారా రూ.5లక్షల వ్యయంతో మంజూరైన డ్రెయినేజీ నిర్మాణానికి అంతర్గత రోడ్డును బుధవారం ఎంపీడీఓ కె.విజయ భాస్కర్‌రెడ్డి, పీఆర్ డీఈ రామకృష్ణ పరిశీలించారు. 200 మీటర్ల పొడవులో నిర్మాణం చేయనున్న ప్రదేశాన్ని పరిశీలించారు. వారి వెంట కార్యదర్శి రవి ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

జూలూరుపాడు: భోజ్యాతండా గ్రామ పంచాయతీలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బానోత్ నవీన్ రాథోడ్, గోపు రామకృష్ణ, వాంకుడోత్ కిషన్, ధరావత్ కాన్సీరామ్, మెంతుల కృష్ణ, లావుడ్యా రవి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్



పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయం ఎదుట జగన్నాథపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ బి.ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వహించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు డాక్టర్ రాజు ఒక్కరు మాత్రమే ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఇల్లెందురూరల్: మావోయిస్టు వారోత్సవాలను సందర్భంగా కొమరారం పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇల్లెందు – గుండాల ప్రధాన రహదారిపై కొమరారం, పోలారం, మర్రిగూడెం గ్రామాల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితులుగా గుర్తించిన వారి వివరాలు పరిశీలించడంతోపాటు వారి ఫొటో తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై నాగుల్‌మీరా పాల్గొన్నారు.

పెసా చట్టాన్ని అమలు చేయాలి

టేకులపల్లి: ఏజెన్సీ ప్రాంతాల్లో అధికారులు పంచాయతీ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్డ్ ఏరియా (పెసా) చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాలోతు శివ నాయక్ కోరారు. ఈ మేరకు బుధవారం సంఘం నాయకుల బృందం టేకులపల్లి ఎంపీడీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దేవ్‌సింగ్, కిషన్, పండు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు సీహెచ్‌పీలో పని కోల్పోయిన కార్మికులందరినీ తక్షణం పనుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో ఇల్లెందు జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం జీఎం వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కె.సారంగపాణి మాట్లాడుతూ.. కేటీసీలో బొగ్గు నాణ్యత లేదనే నెపంతో బొగ్గు రవాణా నిలిపివేశారని, రైల్వే ట్రాన్స్‌పోర్టు వ్యాగన్లు ఆగిపోవటం వల్ల కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. పనులు లేకపోవటం వల్ల కార్మికులు రోడ్డున పడ్డారని వాపోయారు. సింగరేణి అధికారులు జోక్యం చేసుకోవాలని సీహెచ్‌పీకి బొగ్గు రవాణా జరిగే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ రాసుద్దీన్, తోడేటి నాగేశ్వరరావు, డి.మోహన్‌రావు, కె.శ్రీనివాస్, అంజయ్య, శ్రీను, సామేల్, నరసింహారావు, నూనేశ్వరరావు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించండి..


డ్రగ్స్ రూమ్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ సైదులు

జూలూరుపాడు: ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి, చైతన్య పరచాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, డ్రగ్స్ స్టోర్ రూమ్, డెలవరీ రూమ్‌ను తనిఖీ చేశారు. అనంతరం కొత్తగూడెం డివిజన్ పరిధిలోని ఆర్‌బీఎస్కే వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లను కలిసి అంగన్‌వాడీలో పిల్లల పెరుగుదల, బరువు, పోషకాహార లోపంతో బాధపడే పిల్లలను గుర్తించి, ఎన్ఆర్‌సీ సెంటర్‌కు పంపించాలని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లు, డాక్టర్ తేజశ్వని, సీహెచ్ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి..


పాల్వంచరూరల్: రాళ్లచెలకలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దేవేందర్

పాల్వంచరూరల్: ఉల్వనూరు, జగన్నాథపురం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో బుధవారం గురుకుల పాఠశాలల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో డాక్టర్ రాజు 46 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా.. 30 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి, మందులు అందజేశారు. కిన్నెరసాని గిరిజన గురుకుల కళాశాలలో, రాళ్లచెలక గుత్తికోయ గుంపులో ఉల్వనూరు డాక్టర్ దేవేందర్ ఏడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. 230 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎనిమిది మంది విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు.

టేకులపల్లి: బాలికలు విద్యార్థి దశ నుంచే ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి కేజీబీవీ పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. 26 మంది బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, రక్తహీనతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఒకరి వస్తువులు మరొకరు ఉపయోగించరాదని తెలిపారు. ప్రతీ గురువారం ప్రతీ బాలికకు ఒక ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్ మింగించాలని వైద్య, ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు.

ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానం


అవార్డులు అందుకున్న ఆర్టీసీ సిబ్బంది

చుంచుపల్లి: ఆర్టీసీ కొత్తగూడెం డిపో పరిధిలో జూన్‌లో ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లకు, మెయింటెనెన్స్ సిబ్బందికి బుధవారం ప్రగతి చక్రం పురస్కారాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, అసిస్టెంట్ ఎంవీఐ రాకేష్ పాల్గొని ఉద్యోగులను అభినందించారు. మల్లయ్య మాట్లాడుతూ... ఉత్తమ ఉద్యోగులను ఆదర్శంగా తీసుకొని మిగతావారు రీజియన్ స్థాయిలో ఉత్తమ డిపోగా నిలబెట్టాలన్నారు. శ్రావణమాసం చాలెంజ్‌లో భాగంగా అధిక ఆదాయం సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ శ్వేత, డిపో మేనేజర్ ఎం.దేవేందర్‌గౌడ్, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ విజయలక్ష్మి, గ్యారేజ్ సూపర్‌వైజర్ రత్నం, సెక్యూరిటీ ఇన్‌చార్జ్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధిస్తాం..

కొత్తగూడెంఅర్బన్: బహుజన సంఘాల నాయకులు తాండ్ర వెంకటేశ్వర్లు, భూపతి శ్రీనివాసరావు, చదలవాడ సూరి ఆధ్వర్యంలో ఒకరోజు రిలే నిరాహార దీక్ష బుధవారం రైల్వే స్టేషన్ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనమా రాఘవేందర్ హాజరై దీక్షను ప్రారంభించి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి బీసీలకు అన్నిరంగాలలో అన్యాయం జరుగుతోందని, బీసీల్లో వచ్చిన చైతన్యంతో ఈనాడు అన్ని రాజకీయ పార్టీలు బీసీ నినాదాన్ని ముందుకు తీసుకొస్తున్నాయన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు ఏకమై బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధత కల్పించేందుకు కృషి చేయాలన్నారు. దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన వారిలో నాగ సీతారాములు, బత్తుల వీరయ్య, సింధు రమాదేవి, చదలవాడ సూరి, అన్వర్ పాషా, ఆరిఫ్ ఖాన్, వేల్పుల భాస్కర్, శంకర్, నవతన్, రమాకాంత్, రుక్మాంగధర్ బండారి, వేణు పాల్గొన్నారు.

సమస్యలపై పరిష్కార మార్గం చూపండి..


మాట్లాడుతున్న శ్రీధర్

సుజాతనగర్: రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ (327) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనగాల శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సుజాతనగర్‌లో జరిగిన ఐఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో రాష్ట్రవ్యాప్తంగా 22 వేల మంది ఆర్టిజన్ కార్మికులు చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని మోసం చేసిందని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన దగ్గరి నుంచి సంబంధిత మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చినా ఆర్టిజన్ల సమస్య పరిష్కారం కాలేదన్నారు. యాజమాన్యాలు, ప్రభుత్వం స్పందించి ఆర్టిజన్ల సమస్యలపై చర్చించి పరిష్కార మార్గం చూపాలన్నారు. కార్యక్రమంలో నీలం ఐలేష్, పి.మహేందర్ రెడ్డి, కె.శ్రీనివాస్, రామకృష్ణ, రాజేష్, చింతలపూడి సతీష్, చింతలపూడి రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను తీర్చిదిద్దేందుకు కృషి


పాఠకులతో మాట్లాడుతున్న వీరబాబు

పాల్వంచ: జిల్లాలోని గ్రంథాలయాలను మరింత తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. బుధవారం స్థానిక శాఖ గ్రంథాయాలన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయంలో ప్రిపేర్ అయి ఉద్యోగం సాధించిన లక్ష్మిని సన్మానించారు. ఆఫీస్ ఇన్‌చార్జ్ నవీన్‌కుమార్, గ్రంథపాలకుడు మధుబాబు పాల్గొన్నారు.

వైఫై సేవలు ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని నూతన గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధపడేవారు, పాఠకుల కోసం వైఫై సేవలను గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు జి.మణిమ్యదుల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ఇల్లెందు శాఖ గ్రంథాలన్ని జిల్లా నూతన గ్రంథాలయ కమిటీ చైర్మన్ వీరబాబు బుధవారం సందర్శించి పరిశీలించారు. పుస్తకాలు, దిన, పక్ష, వార, మాసపత్రికలను పరిశీలించారు.

ఎమ్మెల్యేకు అండగా ఉంటాం..


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌ను విమర్శించే అర్హత సేవాలాల్ సంఘం వారికి లేదని, వారి వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరరావు అన్నారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలంలో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని లంబాడీ, సుగాలి, బంజారా వర్గాలకు ఇవ్వబడిన షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) హోదాపై తెల్లం వెంకటరావు సుప్రీం కోర్టును ఆశ్రయించారని, ఈ విషయంపై స్పందించిన లంబాడీలు, సేవాలాల్ సేన చేసిన అనుచిత వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. సీతక్కకు మంత్రి పదవిని ఓర్చుకోలేని లంబాడీలు ప్రెస్‌మీట్ పెట్టి విమర్శించటం సమంజసం కాదన్నారు. దేశంలో ఏ కులాన్నయినా గిరిజనుల జాబితాలో చేర్చాలంటే, రాజ్యాంగం ప్రకారమే చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఎమ్మెల్యే వెంకట్రావుకు ఆదివాసీ సమాజం మద్దతుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, జారే కృష్ణ, తాటి పద్మ, కొర్స చోడేశ్వర్, సనప వెంకటరమణ, జారే దీపక్, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు మంజూరు చేయండి..


ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ పథకంలో పైలెట్ గ్రామంగా ఎంపికైన పూబెల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు మొదటి విడత బిల్లులు కూడా మంజూరు చేయక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్దుల్ నబీ అన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ స్థితిగతులను బుధవారం సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. పలు నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నబీ మాట్లాడుతూ.. పైలెట్ గ్రామంగా ఎంపికైన పూబెల్లిలో 83 ఇళ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు వేగవంతంగా చేపడుతున్నారని చెప్పారు. వాటికి మొదటి విడత బిల్లులు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అధికారులు స్పందించి తక్షణం బిల్లులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మన్నెం మోహన్‌రావు, కొడెం బోస్, వజ్జ సురేష్, మూతి రాజశేఖర్, కల్తి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకానికే పరిమితం


ఆరుబయట సమావేశమైన డ్వాక్రా మహిళలు (ఇన్‌సెట్) భవన నిర్మాణ శిలాఫలకం

సుజాతనగర్: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)కు కేటాయించిన గ్రామ సమాఖ్య భవన నిర్మాణం శిలాఫలకానికే పరిమితమైంది. సుజాతనగర్ మండలంలో 29 గ్రామ సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 670 స్వయం సహాయక సంఘాల పరిధిలో 6,670 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. భవన నిర్మాణం కోసం 2007లో అప్పటి ఎమ్మెల్యే రాంరెడ్డి వెంకటరెడ్డి సుజాతనగర్ అంగన్‌వాడీ–1 కేంద్రంలోని ఒకపక్కన ఖాళీ స్థలంలో శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ పథకం రెండో విడతలో భవనం నిర్మించాలని నిర్ణయించారు. శిలాఫలకం వేసి 13 ఏళ్లు కావస్తున్నా.. ఇంతవరకు సెర్ప్ భవనం నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. దీంతో డ్వాక్రా సంఘాల్లోని మహిళలు సభలు, సమావేశాలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం లేకపోవడంతో చెట్ల కిందనే సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామసమాఖ్య భవనం నిర్మించాలని డ్వాక్రా సంఘాల మహిళలు, ప్రజలు కోరుతున్నారు.